సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 11 । జనవరి । 2024



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో బుధవారం టమాట కిలో గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఆమెకు పెరిగిన రక్షణ

పోలీసుల ముందస్తు చర్యలతో పాటు ఏదైనా సంఘటన చోటుచేసుకున్నప్పుడు తక్షణం స్పందిస్తుండటంతో మహిళలపై వేధింపులు, దాడులు బాగా తగ్గాయి. 8లో

గరిష్టం/కనిష్టం

33.2°/ 17.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

17న జెడ్పీ సమావేశం



జెడ్పీ కార్యాలయం

అనంతపురం సిటీ: వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్న ఉభయ జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 17న సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెడ్పీ సమావేశ భవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభించనున్నారు. సమగ్ర వివరాలతో హాజరు కావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సురక్షతో ఆరోగ్యాంధ్రప్రదేశ్

- పేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే 'సురక్ష' లక్ష్యం
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి



సురక్ష శిబిరంలో ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, చిత్రంలో డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి

మడకశిర: 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన, పట్టణంలోని పెనుకొండ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో సౌకర్యాలు పరిశీలించారు. ప్రజలతో వైద్యసేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు స్థానికంగానే కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' తొలి విడత జిల్లాలో విజయవంతమైందన్నారు. రెండో విడత కార్యక్రమానికి కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. పేదలు వైద్యశిబిరాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్లు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'జగనన్న తోడు' నిధుల విడుదల

పుట్టపర్తి అర్బన్: చిరు వ్యాపారులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న తోడు' పథకం 8వ విడత నిధులు గురువారం విడుదల చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో 17,962 మంది అర్హులుండగా, ప్రభుత్వం రూ.10 వేల చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే గతంలో రుణం పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీమాఫీ కింద రూ.39,32,979 జమ చేయనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేసే కార్యక్రమం ఉంటుందన్నారు.

పల్లెకు వెలుగు.. ప్రగతి పరుగు

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- గ్రామాల్లో 24 గంటలూ త్రీఫేస్ కరెంట్ ఉండేలా చర్యలు
- జిల్లాలో రూ.1,618 కోట్లతో పనులు
- కుటీర పరిశ్రమలు, గ్రామాల్లో ఉపాధికి ఎంతో మేలు

పల్లె కాంతులీనేలా జగన్ సర్కార్ చర్యలు చేపట్టింది. గ్రామాలకు త్రీఫేస్ కరెంటు 24 గంటలూ అందించేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. దీంతో నాసిరకం విద్యుత్ సరఫరా అనే మాటే ఇకపై వినపడదు. ఓవర్‌లోడ్ కారణంగా మోటార్లు కాలిపోవడమనే సమస్యే ఉత్పన్నం కాదు. నిరంతరం నాణ్యమైన కరెంటు సరఫరా వల్ల గ్రామీణ యువత స్థానికంగానే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం కలగనుంది.



ధర్మవరం: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ (రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం)కు శ్రీకారం చుట్టింది. జిల్లాలో రూ.1,618 కోట్ల నిధులతో విద్యుత్ సంస్కరణలు చేపట్టేందుకు సర్వం సిద్ధం చేసింది. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రూ.175 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ క్రమంలో ఇప్పటికే గ్రామాల్లో సర్వే పనులను అధికారులు పూర్తి చేశారు. సంక్రాంతి పండుగ రోజు పనులు లాంఛనంగా ప్రారంభించి, శరవేగంగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు.

లాభాలెన్నో..

ఆర్‌డీఎస్ఎస్‌లో భాగంగా జిల్లాలో ఎక్కడైతే ఓవర్ లోడ్ ఫీడర్లు ఉన్నాయో గుర్తించి, వాటికి అనుసంధానంగా కొత్త ఫీడర్లు ఏర్పాటు చేస్తారు. సబ్‌స్టేషన్లు నెలకొల్పుతారు. పట్టణాలకు సమీపంలో అయితే ఇండోర్ సబ్‌స్టేషన్‌లను నూతనంగా ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా గ్రామాలకు, వ్యవసాయ బోరు బావులకు ప్రత్యేక లైన్లు లాగుతారు. 24 గంటలూ త్రీఫేస్ కరెంట్ సరఫరా చేస్తారు. దీంతో యువకులు, రైతులు గ్రామాల్లోనే పేపర్‌ప్లేట్ తయారీ, బిందెల తయారీ లాంటి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చు. వడ్లు ఆడించే మిల్లులు, ఇతర ఫ్యాక్టరీలు సైతం నెలకొల్పుకునే అవకాశం ఉంటుంది. కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో రూ.175 కోట్లతో పనులు

ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద జిల్లాలో రూ.1,618 కోట్లతో పనులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రూ.175 కోట్లతో పనులు చేసేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేసి పనుల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో కొత్తగా 15 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో బత్తలపల్లి మండలంలో ముష్టూరు, మాల్యవంతం, ధర్మవరం మండల పరిధిలోని కేశవనగర్, చిన్నూరు, ముదిగుబ్బ మండల పరిధిలోని కొండగట్టుపల్లి, గుంజేపల్లి, బీడీమర్రి, నల్లచెర్లోపల్లి, మంగళమడక, కొడవండ్లపల్లి, చిన్నకోట్ల, మర్తాడు, పిన్నదరి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

అభివృద్ధికి దోహదం



గ్రామాల్లో త్రీఫేస్ కరెంట్ 24 గంటలూ అందుబాటులో ఉంటే ఎంతో ఉపయోగకరం. నాణ్యమైన కరెంట్ అందుబాటులోకి వస్తే యువత కుటీర పరిశ్రమలు పెట్టుకుని అభివృద్ధి చెందే వీలుంటుంది. ఇప్పటి వరకు ఏదైన కుటీర పరిశ్రమ గానీ, వడ్ల మిషన్‌గానీ పెట్టుకోవాలంటే పట్టణ సరిహద్దులో అధిక అద్దెలు చెల్లించి పెట్టుకునే పరిస్థితి. కొత్తగా చేపట్టిన విద్యుత్ పనులు పూర్తయితే ఇబ్బందులు తప్పినట్లే. – క్రిష్టప్ప, చిన్నకోట్ల గ్రామం, ముదిగుబ్బ మండలం

రైతులకు ప్రయోజనం



ఓవర్‌లోడ్ ఉన్న ఫీడర్లను వేరు చేసి కొత్తవాటిని ఏర్పాటు చేస్తే లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. మోటార్లు బాగా పని చేస్తాయి. రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. – ఆదినారాయణరెడ్డి, రైతు, ఎం. చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం.

నాణ్యమైన విద్యుత్ సరఫరా..

గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రీ వ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం పనులు సంక్రాంతి నుంచి ప్రారంభమవుతాయి. దీంతో గ్రామాల్లో త్రీఫేస్ కరెంట్ 24 గంటలు అందుబాటులోకి రానుంది. బోరు బావుల కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. – సురేంద్ర, విద్యుత్ శాఖ ఎస్ఈ

జెడ్పీ సీఈఓగా నిడియా దేవి

- ఐఏఎస్ శిక్షణ అనంతరం తొలి పోస్టింగ్ 'అనంత'లో



వైఖోమ్ నిడియాదేవి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా వైఖోమ్ నిడియాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఈమె 2020 యూపీఎస్సీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 180వ ర్యాంక్ సాధించారు. ఐఏఎస్ శిక్షణ అనంతరం ఆమెకు తొలి పోస్టింగ్ అనంతపురం జెడ్పీ సీఈఓగా వచ్చింది. జెడ్పీకి ఇప్పటి వరకు ఏడుగురు ఐఏఎస్‌లు సీఈఓలుగా వ్యవహరించగా, నిడియాదేవి 8వ ఐఏఎస్ కావడం గమనార్హం.

చిన్నారి ప్రాణం తీసిన నిమ్మకాయ



మృతి చెందిన చిన్నారి జస్విత

పెద్దవడుగూరు: ముక్కు పచ్చలారని చిన్నారిని నిమ్మకాయ బలిగొంది. ఈ సంఘటన బుధవారం పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... గ్రామానికి చెందిన గోవిందరాజు, దీప దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఏడేళ్ల తరువాత చిన్నారి జస్విత (9 నెలలు) జన్మించింది. చిన్నారి బుధవారం సాయంత్రం ఆడుకుంటూ ఉన్నట్టుండి నిమ్మకాయ నోట్లో పెట్టుకుంది. గొంతులో ఇరుక్కుపోయిన నిమ్మకాయను తీయడానికి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో పెద్దవడుగూరులోని ప్రయివేటు క్లినిక్‌కు తీసుకెళ్లారు. అక్కడా వీలు కాలేదు. దీంతో 108 వాహనంలో అనంతపురం తీసుకెళుతూ మార్గ మధ్యంలోని పామిడిలో ఓ ప్రయివేటు డాక్టర్ వద్ద చూపించారు. అప్పటికే చిన్నారి శ్వాస ఆగిపోయిందని డాక్టర్ తెలపడంతో అక్కడి నుంచి పామిడి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చూపించారు. మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కూతురు, అదీ లేకలేక పుట్టిన సంతానం మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అయ్యారు.

'పురం' చరిత్ర మార్చి చూపుతాం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలు టీఎన్ దీపిక, బోయ శాంతమ్మ



సమావేశానికి హాజరైన ప్రజలు

- వచ్చే ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టండి
- బడుగుల పుట్టినిల్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
- ప్రజాబలంతో చంద్రబాబును శాశ్వతంగా ఇంటికి పంపుదాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

లేపాక్షి: ''హిందూపురం నుంచి బాలకృష్ణను రెండుసార్లు అసెంబ్లీకి పంపితే ఆయనేం చేస్తున్నాడో అందరం చూస్తున్నాం. సినిమా ఫంక్షన్లకు హాజరయ్యేందుకు ఉన్న సమయం ప్రజల యోగక్షేమాలు చూసేందుకు లేదు. నియోజకవర్గంలో ఏపాటి అభివృద్ధి చేశారో పల్లెలు చూస్తే తెలుస్తోంది. మీ అందరి సహకారంతో వచ్చే ఎన్నికల్లో బాలకృష్ణను ఓడించి 'పురం' చరిత్రను మార్చి చూపుతాం. వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడించి అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేస్తాం'' అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. హిందూపురం నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఆయన, బుధవారం వైఎస్సార్ సీపీ హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు టీఎన్ దీపిక, బోయ శాంతమ్మలతో కలిసి లేపాక్షి మండలంలోని పులమతి, మానేపల్లి, శిరివరం, కంచిసముద్రం, మైదుగోళం, లేపాక్షి గ్రామాల్లో పర్యటించారు. ప్రతి పంచాయతీలోనూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలతో మమేకమవుతూ స్థానిక సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పలు వేదికల్లో ప్రసంగించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రతిపక్ష టీడీపీ తీరుపై నిప్పులు చెరిగారు. అధికారంకోసం అలవిగాని హామీలిచ్చే చంద్రబాబు రానున్న ఎన్నికల్లో ప్రతి మహిళకూ కేజీ బంగారం ఇస్తానని కూడా హామీ ఇస్తారని, ఎవరూ నమ్మవద్దని సూచించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏ మూలన ఏం అభివృద్ధి చేశాడో చూపాలన్నారు. బాబు వస్తే జాబు వస్తుందంటే...ఉన్న ఉద్యోగాలు పోయాయన్నారు. చంద్రబాబు తన హయాంలో 2 లక్షల కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తే .. జగనన్న అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేశారన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు మేలు చేశారన్నారు. అందువల్లే జనమంతా ఇప్పుడు జగన్ వెంట నడుస్తున్నారని, దీన్ని జీర్ణించుకోలేని బాబు అరచేతిలో వైకుంఠం చూపేందుకు సిద్ధమయ్యారన్నారు. మరోసారి బాబును నమ్మితే నట్టేట మునుగుతామని హెచ్చరించారు. అభివృద్ధి కోరుకునే వారు వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించాలని కోరారు.

బాబుకు బుద్ధి చెప్పేందుకు జనం సిద్ధంగా ఉన్నారు..

చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అంతా స్వార్థమేనని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. ఆయన ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇంతవరకూ నెరవేర్చలేదన్నారు. బడుగులంటే ఆయనకు చులకన అన్నారు. అందువల్లే తన పాలనలో తన వారికి తప్ప బడుగు, బలహీన వర్గాలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. అయినప్పటికీ మళ్లీ అధికారం కోసం ఇప్పుడు మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజా పాలన కావాలో...ప్రజా వంచన పాలన కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, మదనపల్లి మున్సిపల్ చైర్మన్ జింకా చలపతి, వైఎస్సార్ సీపీ 'పురం' పరిశీలకులు రెడ్డిశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైఎస్సార్ సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, రెడ్డి జేఏసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వెన్నపూస రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచిగూడ-తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు



గుంతకల్లు: సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-తిరుపతి మధ్య 12వ తేదీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ జంక్షన్ నుంచి ఈ రైలు (07041) శుక్రవారం రాత్రి 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు శనివారం ఉదయం 9.00 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైలు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుతుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాంస్కృతిక క్రీడా సమ్మేళనం.. సర్వం సిద్ధం

- నేటి నుంచి హిల్‌వ్యూ స్టేడియం వేదికగా కార్యక్రమాలు
- కఠోర సాధన చేసిన సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియం వేదిక



మైదానంలో సాధన చేస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: ఏటా నిర్వహించే సత్యసాయి విద్యార్థుల క్రీడా సమ్మేళనానికి సర్వం సిద్ధమైంది. ఏటా జనవరి 11న సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆధ్వర్యంలో క్రీడా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే గురువారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లు పూర్తి చేసింది. క్రీడా సమ్మేళనానికి వేదికైన హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికను ప్రత్యేకంగా అలంకరించింది. కార్యక్రమంలో భాగంగా ప్రశాంతి నిలయం, బృందావన్, అనంతపురం మహిళా క్యాంపస్, ముద్దేనహళ్లి క్యాంపస్‌లకు చెందిన 2,500 మంది విద్యార్థులు హిల్‌వ్యూ స్టేడియం వేదికగా సనాతన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు సాహస క్రీడలను ప్రదర్శించనున్నారు. ఇందుకోసం ఆయా క్యాంపస్‌లలో విద్యార్థులు రెండు వారాలుగా కఠోర సాధన చేస్తున్నారు.

- గురువారం ఉదయం 8 గంటలకు విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్‌తో సాంస్కృతిక క్రీడా సమ్మేళనం ప్రారంభమవుతుంది. ప్రశాంతి నిలయం, ముద్దేనహళ్లి, బృందావన్ క్యాంపస్‌ల విద్యార్థులు విన్యాసాలను ప్రదర్శిస్తారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ముగియనుంది. సాయంత్రం 4.15 గంటలకు ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం, ప్రైమరీ, వైట్‌ఫీల్డ్ సత్యసాయి నర్సింగ్ కళాశాల, అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థుల ప్రదర్శనలు ఉంటాయి.
- 12వ తేదీ ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, 13వ తేదీ సాయంత్రం ముద్దేనహళ్లి విద్యార్థుల ప్రదర్శన ఉంటుంది.
- 14వ తేదీ ఉదయం సత్యసాయి విద్యాసంస్థల సంగీత విభాగం ఆధ్వర్యంలో సంగీత కచేరీ, సాయంత్రం బృందావన్ క్యాంపస్ విద్యార్థుల నాటిక ఉంటుంది.
- 15వ తేదీన సాంస్కృతి క్రీడా సమ్మేళనంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం, సాయంత్రం ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థుల నాటక ప్రదర్శన ఉంటుంది.

క్లుప్తంగా

పశుశాఖ 'మినిస్టీరియల్' రాష్ట్ర కమిటీలో చోటు


అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ మినిస్టీరియల్ యూనియన్ రాష్ట్ర కమిటీ అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన పశుశాఖ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇందులో అధ్యక్షుడిగా కేవీ రాఘవులు (చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా కృష్ణారావు (కృష్ణా జిల్లా)తో పాటు అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు (అనంతపురం), కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గోరంట్ల: మండలంలోని కదిరి–గోరంట్ల మార్గంలో కోరేవాండ్లపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 121.90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్‌ఐ జయపాల్‌రెడ్డి, ఏఈఈ టి.కుళ్లాయిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 5.36 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ బోయ రామచంద్ర, బియ్యం తరలింపుదారు కిష్టయ్యపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర రెడ్డికి అప్పగించారు.

న్యాక్ గ్రేడ్‌కు అందరి సహకారం కావాలి

అనంతపురం: జేఎన్‌టీయూ(అనంతపురం)ను న్యాక్ నమూనా పీర్ కమిటీ బుధవారం సందర్శించింది. అన్నా యూనివర్సిటీ, చెన్నై ఎమిరేటర్స్ ప్రొఫెసర్ టి.త్యాగరాజన్ ఆధ్వర్యంలోని కమిటీ కళాశాల లైబ్రరీ, సెంట్రల్ కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రికల్ విభాగం, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ , కంప్యూటర్ సైన్సెస్ విభాగాలను పరిశీలించింది. అనంతరం కమిటీతో కలిసి ప్రొఫెసర్లతో సమీక్ష నిర్వహించారు. తొలుత వీసీ జింకా రంగ జనార్దన జేఎన్‌టీయూకు సంబంధించి సిలబస్ రూపకల్పన, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, ఇంటర్న్‌షిప్, అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, స్టూడెంట్ ఫ్యాకల్టీ నిష్పత్తి, రీసెర్చ్ ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్, ఎన్‌బీఏ తదితర అంశాలను వివరించారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ సాధించాలంటే అందరి సహకారం అవసరమని, ఈ మేరకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు, ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆమెకు పెరిగిన రక్షణ

- మహిళలపై తగ్గిన వేధింపులు
- కిడ్నాప్, అత్యాచారాలు, హత్యలు తగ్గుముఖం
- అదనపు కట్న వేధింపుల హత్యలు స్వల్ప పెరుగుదల



సాక్షి, పుట్టపర్తి: మహిళలు, యువతులు, చిన్నారులపై జిల్లాలో వేధింపులు తగ్గుముఖం పట్టాయి. పార్కులు, షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, కాలేజీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇళ్లలో మహిళలు రోడ్లపై యువతులు వేధింపులు, గృహ హింసలకు గురి కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. 2022తో పోల్చుకుంటే మహిళలపై నేరాల సంఖ్య 2023లో గణనీయంగా తగ్గడమే ఇందుకు నిదర్శనం. గతంలో ప్రజా రవాణాతో పాటు రాత్రి వేళల్లో సొంత వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిపై కూడా అఘాయిత్యాలు చోటు చేసుకున్నాయి. మరోవైపు సెల్‌ఫోన్ల ద్వారా బ్లాక్‌మెయిల్ కాల్స్ బెడదను మహిళలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం అదనపు కట్న కేసులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, వివాహేతర సంబంధాలు... తదితర నేరాల శాతం గణనీయంగా తగ్గింది.

సీసీ కెమెరాలదే ప్రధాన పాత్ర..

మహిళలు, యువతుల కిడ్నాప్ కేసులు, మహిళలపై అత్యాచారం కేసులు తగ్గుముఖం పట్టడం వెనుక పోలీసుల కృషి గణనీయంగా ఉంది. ఎక్కడికక్కడ బందోబస్తు నిర్వహిస్తుండడంతో పాటు నేరం చోటుచేసుకున్న క్షణాల వ్యవధిలోనే ఆధునిక సాంకేతికత సాయంతో అరికట్టే చర్యలు చేపట్టారు. జనావాస ప్రాంతాలతో పాటు అరక్షిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. జిల్లా వ్యాప్తంగా 46 పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేస్తున్నాయి. అంతేకాక ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

అన్ని కేసుల్లోనూ తగ్గుదల

2022లో వరకట్న మరణాలు 7, మహిళా హత్యలు 22 నమోదయ్యాయి. కానీ 2023లో వరకట్న మరణాలు రెండు మాత్రమే జరిగాయి. అలాగే రెండో పెళ్లి కేసులు అంతకు ముందు 27 ఉండగా.. 2023లో కేవలం ఆరు మాత్రమే వెలుగు చూశాయి. మహిళలపై దౌర్జన్యాలు 492 నుంచి 183కి తగ్గాయి. ఆత్మహత్యాయత్నం కేసులు 32 నుంచి 12కు తగ్గాయి.

మూడింట రెండవ వంతే..

ఏడాది కాలంలో 2022లో మహిళలపై దౌర్జన్యాలకు సంబంధించి అన్ని రకాల కేసులు 867 నమోదుకాగా, 2023లో 520 కేసులు నమోదు కావడం విశేషం. ఇందులో వరకట్న మరణాలు, ఆత్మహత్యాయత్నం, మహిళా హత్యలు, రేప్, కిడ్నాప్, దౌర్జన్యాలు, రెండో పెళ్లి కేసులు గణనీయంగా తగ్గాయి. కాగా అదనపు కట్నం వేధింపుల హత్యలు స్వల్పంగా పెరిగాయి. మహిళలపై వేధింపులు గతం కంటే మరింతగా పెరిగడం ఆందోళన కరం.

గత రెండేళ్లలో జిల్లాలో నేరాల సంఖ్య ఇలా...		
నేరం	2022	2023
వరకట్న మరణాలు	7	2
ఆత్మహత్యాయత్నం	32	12
రెండో పెళ్లి కేసు	27	6
వేధింపులు	197	258
మహిళా హత్యలు	22	5
డీపీ యాక్ట్	0	0
అత్యాచారాలు	39	29
కిడ్నాప్	51	22
మహిళలపై దౌర్జన్యాలు	492	183
అదనపు కట్న హత్యలు	00	3
మొత్తం	867	520

ధైర్యంగా ఉండాలి



మహిళలు అన్ని విషయాల్లో ధైర్యంగా ఉంటూ సమస్యను పరిష్కరించుకోవాలి. ఆన్‌లైన్ లేదా ఇతర కోణాల్లో వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలి. ఆపద సమయాల్లో డయల్ 112 లేదా 100కు కాల్ చేయవచ్చు. దిశ మొబైల్ యాప్ ద్వారా రక్షణ కోరవచ్చు. 2022తో పోల్చుకుంటే 2023లో మహిళలపై నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. – ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

గోరంట్ల: మండలంలోని కాగానిపల్లిలో బుధవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో రెండేళ్ల వయసున్న చిన్నారి ధనుష్‌తో పాటు గంగులమ్మ, గౌతమి గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురంలోని జిల్లాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


రామలక్ష్మి (ఫైల్)

పెద్దపప్పూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి నాలుగు నెలల క్రితం వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం సమీపంలోని ఉత్తికాయలపల్లికి చెందిన రామలక్ష్మి (26)ని పెళ్లి చేసుకున్నాడు. బుధవారం సాయంత్రం అత్తారింటి నుంచి భార్యను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరిన శ్రీనివాసరెడ్డి... పెద్దపప్పూరు మండలం చిన్నయక్కలూరు సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. స్వల్ప గాయాలతో శ్రీనివాసరెడ్డి బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రామలక్ష్మిని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శరత్‌చంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు పట్టారు.

జనవాక్కు

పడిగాపులు తప్పాయి



వికలాంగుల కోటాలో నాకు ప్రతి నెలా రూ.3వేల పింఛన్ అందుతోంది. గతంలో పింఛన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద రోజంతా పడిగాపులు కాసేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారు. దీంతో పడిగాపులు తప్పాయి. మావంటి దివ్యాంగులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇలాంటి ముఖ్యమంత్రి చిరకాలం ఉండాలని కోరుకుంటున్నా.

– తిప్పేస్వామి, ఫకారం, గుడిబండ మండలం

సొంతిల్లు దక్కింది



సొంతిల్లు లేక పదేళ్లుగా అద్దె ఇంట్లోనే నెట్టుకొచ్చాం. గత ప్రభుత్వంలో పలుమార్లు సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇచ్చిన దరఖాస్తులన్నీ జన్మభూమి కమిటీ వాళ్లు చెత్తకుప్పలో పడేసేవాళ్లు. ఇక మాకు సొంతిల్లు రాదనే అనుకున్నాం. ఇలాంటి పరిస్థితిలో వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టి మా బతుకులు బాగు చేశారు. నాకు సొంతిల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం కూడా పూర్తయింది. మాకు గూడు కల్పించిన దేవుడు జగనన్న. ఆయనకే మా మద్దతు.

– రాజమ్మ, తెనగల్లు, కుందుర్పి మండలం

పథకాల లబ్ధి చేకూరింది



వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి జీవితాలు బాగుపడ్డాయి. మాకూ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. నాకు పింఛన్ మంజూరైంది. నా భార్యకు చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. మాలాంటి పేదలందరూ ఇలాంటి పాలకులనే కోరుకుంటారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– కుంటిన్న, కొర్రకోడు, కూడేరు మండలం

మా పాలిట దేవుడు



తలసేమియాతో బాధపడుతున్న నా ఇద్దరు కుమారుల వైద్య సేవలకయ్యే ఖర్చును అందేలా చేసి సీఎం వైఎస్ జగన్ మా పాలిట దేవుడయ్యారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిలో ఇద్దరు పిల్లలు తలసేమియాతో బాధపడుతున్నారు. నెలలో కనీసం రెండు సార్లు ఆస్పత్రికి పిలుచుకెళ్లి చికిత్స చేయించుకుని రావాలి. ఆస్పత్రికి వెళ్లినప్పుడల్లా రూ.20 వేల వరకూ ఖర్చు వచ్చేది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కష్టాల్లో ఉన్న మాకు కొండంత ధైర్యాన్ని ఇస్తూ ఒక్కొక్క పిల్లాడికి రూ.10 వేలు చొప్పున ఇద్దరికీ రూ.20 వేలు పింఛన్ అందేలా చేశారు. పిల్లల చికిత్సకు ఢోకా లేకుండా పోయింది. సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడ్డాం.

– వీరాంజనేయులు, పెద్దవడుగూరు

డివిజన్ అభివృద్ధికి పాటుపడాలి

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకుంటున్న హేమంత్

గుంతకల్లు: మరింత బాధ్యతగా వ్యవహరిస్తూ డివిజన్ అభివృద్ధికి పాటుపడాలని రైల్వే ఉద్యోగులకు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. ఈ ఏడాది విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన దాదాపు 47 మంది ఉద్యోగులు డీఆర్‌ఎం అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి బుధవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని న్యూమీటింగ్ హాల్ అవార్డులను డీఆర్‌ఎం అందజేసి, మాట్లాడారు. ఉద్యోగుల కృషి ఫలితంగా గుంతకల్లు డివిజన్ అన్ని విభాగాల్లో రాణిస్తూ జోనల్‌లో మంచి గుర్తింపు దక్కించుకుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఎఫ్‌ఎం అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

పుట్టపర్తి టౌన్: అడిషనల్ ఎస్పీ విష్ణు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నాటు సారా స్థావరాలపై బుధవారం సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధిలోని ముదిగుబ్బ మండలంలో 110 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. సీకేపల్లి, పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి, తనకల్లు సెబ్ స్టేషన్ల పరిధిలో 227 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసులు నమోదు చేశారు.

క్రీడలతో మంచి గుర్తింపు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


క్రీడాకారుల వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ (చిత్రంలో) మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: క్రీడలతో క్రీడాకారులకు మంచి గుర్తింపు వస్తుందని, ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తి చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగంతో కలసి ఆయన బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి పెంచడంలో భాగంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతిభ గల గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసి, వారిని జాతీయ స్థాయికి ఎదిగేలా చేసేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఎస్‌డీఓ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, మున్సిపల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, చెలిమి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండకు పర్యాటకుల తాకిడి


పెనుకొండ కొండపైకి చేరుకుంటున్న బెంగళూరు యువత


పెనుకొండ కోట


పెనుకొండ కోట అద్భుతమంటున్న బెంగళూరుకు చెందిన స్నేహితులు


కొండపైకి దూసుకెళుతున్న వాహనాలు

పెనుకొండ: విజయనగర రాజుల రెండో రాజధానిగా ఖ్యాతి గాంచిన పెనుకొండ కోటను సందర్శించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇటీవల కొండపైకి రాకపోకలు సాగించేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు రూ.14 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో కొండపైకి ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు సులువుగా వెళుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం బెంగళూరు నుంచి పదుల సంఖ్యలో ప్రైవేట్ వాహనాల్లో పర్యాటకులు వస్తున్నారు.


కొండపై మంటపం

గంటల తరబడి ఒకేచోట

- రైల్వే అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రయాణికులకు ఇక్కట్లు
- ఒకే స్టేషన్‌లో నిలిపే రైళ్లను పొడిగిస్తే రైల్వేకు గణనీయ ఆదాయం
- ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు



ధర్మవరం రైల్వే స్టేషన్‌లో నిలిపి ఉంచిన నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు

గుంతకల్లు: పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుని తిరుగు ప్రయాణంలో గంటల తరబడి రైల్వే స్టేషన్లలోనే నిలబడుతున్నాయి. రైల్వే ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయంతో ఒకే స్టేషన్‌లో గంటల తరబడి నిలబడి పోతున్న రైళ్లను మరింత దూరం పొడిగిస్తే అటు రైల్వేకు ఆదాయంతో పాటు ప్రయాణికులకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఆ దిశగా రైల్వే బోర్డు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్టేషన్లలో నిలిచిపోయే రైళ్లు ఇవే..

- సికింద్రాబాద్–కర్నూలు సిటీ మధ్య నడుస్తున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ (17023) రోజూ ఉదయం 7.30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు కర్నూలు సిటీ చేరుతుంది. తిరిగి కర్నూలు నుంచి సికింద్రాబాద్ (17024)కు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుంది. దాదాపు 2.30 గంటల పాటు ఈ రైలును కర్నూలు రైల్వే స్టేషన్‌లోనే ఆపేస్తున్నారు. ఇదే రైలును గుంతకల్లు వరకూ పొడిగించాలనే డిమాండ్ ఏళ్ల తరబడిగా వినవస్తున్నా... నేటికీ ఆ దిశగా రైల్వే అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ రైలును గుంతకల్లు వరకూ పొడిగించడం వల్ల హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారుస్తులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- తిరుపతి మీదుగా సంచరించే నరసాపూర్ – ధర్మవరం (17248) ఎక్స్‌ప్రెస్ రైలు రోజూ సాయంత్రం నరసాపూర్‌లో 5.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు ధర్మవరానికి చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 2.20 గంటలకు ధర్మవరం నుంచి బయలుదేరి తిరుపతి మీదుగా నరసాపూర్‌కు చేరుకుంటుంది. దాదాపు 4.20 గంటల పాటు వృథాగా ధర్మవరం రైల్వే స్టేషన్‌లోనే నిలిచి ఉంటే ఈ రైలును అనంతపురం వరకూ పొడిగిస్తే కలియుగదైవం ప్రత్యక్ష దైవంగా ప్రజలు కొలిచే ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే వారికి, విజయవాడకు రాకపోకలు సాగించేవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.
- విశాఖపట్నం – వైఎస్సార్ కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488) రైలు కడప జంక్షన్‌కు చేరుకోగానే దాదాపు 9.45 గంటల పాటు నిలబడుతుంది. ఈ రైలు విశాఖపట్నం జంక్షన్‌లో రోజూ మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.00 గంటలకు కడపకు చేరుతుంది. తిరిగి ఈ రైలు సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరుతుంది. అయితే ఈ రైలులో నీటిని నింపేందుకు దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపురం రైల్వేస్టేషన్‌కు తరలిస్తుంటారు. ఆ సమయంలో ఈ రైలు కడప నుంచి కొండపురం రైల్వేస్టేషన్ వరకూ ఖాళీగా రాకపోకలు సాగిస్తుంది. అదే ఈ రైలును గుంతకల్లు వరకూ పొడిగిస్తే వాటర్ ఫిల్లింగ్‌తో పాటు ప్రయాణికులకూ ఉపయోకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

ఈ రైళ్లను పునరుద్ధరించండి

గుంతకల్లు–ధర్మవరం–గుంతకల్లు ఫాస్ట్ ప్యాసింజర్, బెంగుళూరు–విజయవాడ–బెంగుళూరు ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునర్ధరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. కరోనా సమయంలో ఈ రెండు రైళ్లను అధికారులు నిలిపివేశారు. దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా... నేటికీ ఈ రైళ్లను పునరుద్ధరించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుక్కల దాడిలో 90 గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రెపిల్లలు

అమడగూరు: కుక్కల దాడిలో 90 గొర్రెపిల్లలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన మేరకు... తాడిమర్రికి చెందిన గొర్రెల కాపర్లు పోతులయ్య, నారాయణస్వామి, శివ వారం రోజుల క్రితం మేపునకు గొర్రెలను తోలుకొని అమడగూరు మండలం మహమ్మదాబాద్ సమీపంలోకి చేరుకున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రైతు బుజ్జి పొలంలో మందను వదిలారు. బుధవారం రాత్రి ఉన్నఫళంగా ఊరు కుక్కలు మందలోకి చొరబడి బీభత్సం సృష్టించాయి. గమనించిన కాపర్లు వెంటనే కుక్కలను అక్కడి నుంచి తరిమికొట్టారు. ఈ లోపు కుక్కల బారిన పడిన 90 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనతో తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా అధికారులను బాధిత కాపరులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం క్రైం: నగర నడిబొడ్డున పేకాట ఆడుతూ 13 మంది పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని సాయినగర్ 2వ క్రాస్‌లో ఓ ఇంటిని రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, నారాయణస్వామి, నాగేంద్ర, తదితరులు అద్దెకు తీసుకుని పేకాట స్థావరంగా మార్చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టి నిర్వాహకులతో పాటు 13 మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 2 లక్షలు నగదు, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు.